క్లుప్తంగా

పాండురంగ స్వామికి పూజలు


స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్: మాఘశుక్లపక్ష శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని మహారాష్ట్రలోని పుణ్యక్షేత్రం పండరీపూర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి శనివారం సందర్శించారు. అక్కడి ఆలయంలో రుక్మిణి, పాండరంగ స్వామిలను దర్శించుకున్నారు. కరణ్ గజేంద్రభారతి మహారాజ్, అంబాదాస్ మహారాజ్‌ల ఆశీస్సులు పొందారు. కరణ్ గజేంద్రభారతి మహారాజ్ ఆయనను శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యే వెంట పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఏసు రెడ్డి, రాజుసేట్, లక్ష్మణ్‌సేట్, వెంకట్‌సాగర్, తానాజీ ఉన్నారు. అలాగే, జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మశ్చందర్ పండరీపూర్ వెళ్లి రుక్మిణి, పాండురంగ స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా చౌడేశ్వర ఆలయ వార్షికోత్సవం


పూజలు చేసిన ఎమ్మెల్యే ప్రభాకర్ తదితరులు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణం హట్కర్‌పేటలోని శ్రీరామలింగ చౌడేశ్వర మందిరం 26వ వార్షికోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం గోపూజ, ధ్వజారోహణం కార్యక్రమాలు చేశారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి అభరణాలు, మహిళలతో సామూహిక కలశాల ఊరేగింపు పట్టణ పురవీధుల గుండా మందిరం వరకు నిర్వహించారు. అనంతరం తంగడపల్లి ఆశ్రమ అప్పగారు శివయోగి శివాచార్యుల పాదపూజ చేశారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని రామలింగేశ్వరుడిని దర్శించుకున్నారు.

క్రీడాపోటీలు


క్రీడాపోటీలో పాల్గొన్న క్రీడాకారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఫిప్ అండ్ ఫిదర్ అకాడమీ తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ క్రీడాపోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ.. గత నెల రోజులుగా వారానికి ఒక క్రీడాపోటీని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో వివిధ కాలనీలకు చెందిన 470 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం


మాట్లాడుతున్న పీఆర్టీయూ నేత మాణయ్య

జోగిపేట(అందోల్): సత్యసాయిబాబా శత జయంతి సందర్భంగా సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో జోగిపేటలోని ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి అవసరమైన సదుపాయాలు కల్పించడం అభినందనీయమని జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడు ఎ.మాణయ్య అన్నారు. శనివారం జోగిపేటలోని ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలలో సీఈఎస్ లిమిటెడ్ వారి సౌజన్యంతో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పాఠశాల గ్రౌండ్ ఫ్లోరింగ్, భవన సముదాయానికి రంగులు, మైక్‌సెట్‌ను కంపెనీ అధినేత వెంకట్ అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సంతోష్, ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్, బాలకృష్ణ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం చేపట్టారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పటాన్‌చెరు టౌన్: సబ్ స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా ఆదివారం ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు పటాన్‌చెరు డివిజన్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ నిలిపివేనున్నట్లు ఏఈ జగదీశ్వర్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని పారిశ్రామిక ప్రాంతం, సాయి గణేష్ కాలనీ, ఆల్విన్ కాలనీ, సింఫనీ కాలనీ, బండ్లగూడ, భూపాల్ రెడ్డి కాలనీ, నేతాజీ నగర్, బాలాజీ నగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఎకరం వారికే తొలి ‘భరోసా’

- మొదటిగా సన్న, చిన్నకారు రైతులకు..
- మండలంలో 39 వేల ఎకరాలు
- 18,950 మందికి రైతు భరోసా
- ఇప్పటి వరకు రూ. 21,24,601 జమ



మునిపల్లి(అందోల్): ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రైతులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. రైతు భరోసా పథకం అమలులో భాగంగా తొలుత ఎకరం సాగు భూములకు పెట్టుబడి సాయం విడుదల చేసింది. రబీ పంటలకు సంబంధించిన పెట్టుబడి సాయం మంజూరైనట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. మండలంలో మొత్తం 39 వేల ఎకరాలు భూమి సాగులో ఉంది. 18, 850 మందికి గాను రూ. 21,24,601 కోట్ల రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు అధికారులు తెలిపారు. తదుపరి పెద్ద రైతులకు రైతు భరోసా నిధులు మంజూరవుతాయని చెప్పారు. ధరణి, పోర్టల్, ఖాతా వివరాల ప్రకారం వ్యవసాయ విస్తరణ అధికారులు లాగిన్‌లో క్రోడీకరించారు. సదరు వివరాల ప్రకారం పెట్టుబడి సాయం అందుతుందని అధికారులు వెల్లడించారు. మండలంలోని ఇబ్రాహీంపూర్ గ్రామంలో మొదట రైతు భరోసా ప్రారంభించిన ప్రభుత్వం సాగు భూములకు ఎకరా వరకు డబ్బులు రైతుల అకౌంట్‌లో జమ చేశామని వివరించారు.

ఖరీఫ్ సీజన్‌కు భరోసా రానట్టే?

2024 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పెట్టుబడి సాయం ఇప్పటికీ రైతుల ఖాతాలో జమ కాలేదు. 2024 రబీ సీజన్ రైతు భరోసా మాత్రం రైతుల ఖాతాలో ఎకరా వరకు డబ్బులు జమ అయినట్లు అధికారులు చెబుతున్నారు. ఇక ఖరీఫ్ సీజన్ రైతు భరోసా రానట్టేనని స్పష్టమవుతుంది. ప్రస్తుతం రైతుల బ్యాంకు అకౌంట్లో జమ అవుతున్న డబ్బు లు రబీ సీజన్‌వేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

సాగు భూములన్నింటికీ..



ప్రభుత్వ నిబంధనల ప్రకారం సాగు భూమి ఉన్నా రైతులందరికీ రైతు భరోసా మంజూరు చేయాలి. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పెట్టుబడి సాయం కూడా ఇవ్వాలి.. ఖరీఫ్, రబీ సీజన్‌లు రెండు కలిపి రైతుల అకౌంట్లో జమ చేసి ఆదుకోవాలి.

–ఇద్గి శంకరయ్య (రైతు పిల్లోడి)

ప్రభుత్వం మంజూరు చేసింది



రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు పెట్టుబడి సాయం మంజూరు చేస్తోంది. మొదట సన్న, చిన్న కారు రైతులకు మంజూరు చేసి, పెద్ద రైతులకు విడతల వారీగా మంజూరు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం రైతు భరోసా డబ్బులు అకౌంట్లో జమ అవుతున్నాయి.

–అంజలి (మండల వ్యవసాయాధికారి)

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ


వట్‌పల్లి(అందోల్): స్వయం పరిపాలనలో పాల్గొన్న విద్యార్థులు

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండల పరిధిలోని పోసానిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. పదవ తరగతి విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించి మిగతా విద్యార్థులకు పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా మానస, డీఈఓగా శృతి, ఎంఈఓగా మోహన్, హెచ్‌ఎంగా శివకుమార్, నిరీక్షణ, లాస్య, సుప్రియ, పల్లవి, శ్రావణి, లక్ష్మీ,తేజస్విని, స్పందన, మౌనిక, భవాని తదితరులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఎస్.మురళీక్రిష్ణ మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ, మహేశ్, శివకుమార్, రాజేశవరీ, మీరాబాయి, అనిత, జ్యోతి పాల్గొన్నారు.

జోగిపేటలో..

జోగిపేట(అందోల్): జోగిపేటలోని కేంబ్రిడ్జి ఉన్నత పాఠశాలలో శనివారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారారు. విద్యాశాఖ మంత్రిగా హరిప్రియ, డీఈఓగా స్పందన, ఎంఈఓగా ఐశ్వర్య, కలెక్టర్‌గా శరణ్య, ఉపాధ్యాయులుగా సోస్థ, సహస్ర, వైష్ణవి, పీఈటీగా కమల్‌లు వ్యవహరించారు. మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ లక్ష్మన్‌రావు, కరస్పాండెంట్ విష్ణువర్ధన్ రెడ్డి, డైరెక్టర్ గోపాల్‌రెడ్డి అభినందించారు.


ముదిమాణిక్యంలో..

ముదిమాణిక్యం ఉన్నత పాఠశాలలో..

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని ముదిమాణిక్యం ఉన్నత పాఠశాలలో శనివారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. ముగింపు కార్యక్రమంలో ఎంఈఓ శంకర్, హెచ్‌ఎం అఖిల పర్యవేక్షించారు.

విశ్వపాలిని మందిరంలో చండీయాగం


చండీయాగం నిర్వహిస్తున్న చంద్రమౌళి శర్మ, తదితరులు

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట్ మండలం, బల్కంచెల్క తండాలోని విశ్వపాలిని జ్వాలముఖి భవాని సమేత సేవలాల్ మహరాజ్ మందిరంలో శనివారం సప్తదశ చండీయాగం ఘనంగా నిర్వహించారు. మందిరం ధర్మకర్త, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ మూడ్ కిషన్‌సింగ్ లలిత దంపతుల ఆధ్వర్యంలో యాగం చేపట్టారు. ప్రముఖ జ్యోతిశ్య వాస్తు శాస్త్ర పండితులు చంద్రమౌళి శర్మ నేతృత్వంలో మందిరంలో ప్రత్యేకంగా పూజలు చేశారు. మహారాష్ట్రలోని లాతుర్‌కు చెందిన అంకుశ్ శర్మ, మందిరం పురోహితులు మనోజ్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రులు పఠించారు. హారతి, తీర్థప్రసాదం, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో తండా ప్రముఖులు ఖత్రోత్ జైల్‌సింగ్, రూప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

పటాన్‌చెరు టౌన్: మండలంలోని ఇంద్రేశం ప్రభుత్వ పాఠశాలలో ఎంఎన్ఆర్ ఆస్పత్రి సౌజన్యంతో మేడ్వాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మోడల్ స్కూల్ ప్రాజెక్ట్‌లో భాగంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వారి, తల్లిదండ్రులకు పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. హెచ్‌ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మేడ్వాన్ డైరెక్టర్ హెచ్ మధుసూదన్ రెడ్డి, వైద్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని నాగులపల్లి, కోనాపూర్ ప్రభుత్వ పాఠశాలలను శనివారం ఎంఈఓ శంకర్ సందర్శించారు. ఈ సందర్భంగా విదార్థుల, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఉత్తమ ఫలితాలను సాధించాలని సూచించారు. నాగులపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయుడు ప్రవీణ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు సుధాకర్, జయకృష్ణ, సిఆర్పీ రాజేశ్వర్ పాల్గొన్నారు.

పోమ్యనాయక్ తండాలో..

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని పోమ్యనాయక్ తండా పాఠశాలను ఎంఈఓ శ్రీనివాసులు శనివారం తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, విద్యార్థుల హాజరు శాతం పరిశీలించారు. పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచాలని టీచర్లకు సూచించారు.

ఘనంగా గంగపటం పూజలు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో మల్లన్న స్వామి జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో రెండవ రోజు గంగపటం కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆలయ ధర్మకర్తలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో బొల్లారం పారిశ్రామిక వాడలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో హనుమంత్‌రెడ్డి, రాజేందర్ రెడ్డి, యాదిరెడ్డి, వరప్రసాద్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, స్థానిక నాయకులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని సాయిరాంనగర్ కాలనీలోని శ్రీషిర్డి సాయి బాబా మందిర 23వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గురువుల అమ్ముల సాంబశివరావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉ.5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ప్రసాద వితరణ, అన్నదానం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఉ. 9 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు బాబా పాద స్పర్శ దర్శన ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

10 నుంచి పత్తి కొనుగోళ్లు

మునిపల్లి(అందోల్): ఈ నెల 10 నుంచి 13 వరకు రాయికోడ్, మునిపల్లి మండలాల్లోని ఆయా పత్తి మిల్లుల్లో పత్తిని కొనుగోలు చేయనున్నట్లు రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ పర్మిషన్ తీసుకుని మూడు రోజుల పాటు రైతుల దగ్గర ఉన్న పత్తిని కొనాలని సంబంధిత అధికారులతో మాట్లాడామని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిల్లల చదువు బాధ్యత తీసుకుంటా..

టీజీటీపీఎస్ మాజీ చైర్మన్ భిక్షపతి


చిన్నారులతో మాట్లాడుతున్న భిక్షపతి

వట్‌పల్లి(అందోల్): మండలంలోని కేరూర్ గ్రామంలో బురగల్ల బూదెమ్మ, సామెల్ దంపతులకు భాగ్య(11), భార్గవి(9) ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్నతనంలో వారిని తండ్రి వదిలేసి వెళ్లాడు.. అన్ని తానై కూలీ పనులు చేసి పోషించిన తల్లి బూదెమ్మ అనారోగ్యంతో రెండు రోజుల క్రితం మృతి చెందింది. దీంతో పిల్లలిద్దరు అనాథలుగా మిగిలారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి గ్రామానికి వెళ్లి పిల్లలను పరామర్శించి, తక్షణ సహాయం రూ. 20 వేల నగదు అందజేశారు. పిల్లల చదువులకు అయ్యే ఖర్చును తానే తీసుకుంటానని హామీ ఇచ్చారు. తల్లిదండ్రులను చిన్నతనంలోనే దూరం చేసుకోవడం బాధాకరమన్నారు. పీఏసీఎస్ చైర్మన్ వినోద్‌గౌడ్, నాయకులు ప్రభాకర్, వీరన్న గౌడ్, శ్రీను, కుమార్, మాణయ్య, మల్లేశం, గోపాల్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విజయోత్సవాలు


జిన్నారం (పటాన్‌చెరు): సంబరాలు చేస్తున్న బీజేపీ నాయకులు

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో శనివారం జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు ర్యాలీలు, టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధికి సంపూర్ణ మద్దతు లభిస్తుందన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలోనూ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం ధీమా వ్యక్తం చేశారు.


జోగిపేటలో బాణా సంచా కాల్చుతున్న బీజేపీ నాయకులు


హత్నూర : దౌల్తాబాద్‌లో..


సదాశివపేట పట్టణంలో..

తాగునీటి ఎద్దడికి ముందస్తు చర్యలు


గూడూరును సందర్శించిన అధికారులు

నారాయణఖేడ్: రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా శనివారం ఆయన ఎస్ఈ రఘువీర్, ఈఈ నాగభూషణం, డీఈ గాయత్రి, ఏఈ తిరుమలేష్‌లతో కలిసి నాగల్‌గిద్ద మండలం గూడూరులోని తాగునీటి పథకం పంప్‌హౌజ్‌ను సందర్శించారు. పక్కనే ఉన్న మంజీరానది, పంపుహౌజ్‌లో తాగునీటి సరఫరాకు సంబంధించిన పంపులు, పైపులైన్లు పరిశీలించారు. గూడూరు పథకం కింద ఉన్న 33 ఆవాసాలకు ఇబ్బందులు లేకుండా తాగునీరు సరఫరా చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

కాలుష్య నియంత్రణ అధికారుల పర్యటన


మేళ్ల చెరువును సందర్శించిన అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌లోని మేళ్ల చెరువును శనివారం హైడ్రా విభాగంలోని కాలుష్య నియంత్రణ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా మేళ్ల చెరువు, పలు గేటెడ్ కమ్యూనిటీ కాలనీలోని ఎస్టీపీ ప్లాంట్లను పరిశీలించారు. అనంతరం బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుంకు వినయ్ కుమార్ మాట్లాడుతూ.. గత నెలలో చెరువుల కాలుష్యంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. అందులో భాగంగా అధికారులు మేళ్ల చెరువును సందర్శించారని చెప్పారు. గేటెడ్ కమ్యూనిటీ కాలనీలోని ఎస్టీపీ ప్లాంట్‌ను పరిశీలించి అక్కడ నుంచి ల్యాబ్ పరీక్షల నిమిత్తం నీటిని సేకరించారు. అలాగే, చెరువు నీటిని కూడా సేకరించి తీసుకెళ్లారు. ఆయా కాలనీలకు చెందిన మురుగు నీరు చెరువులోకి చేరుతుందని అధికారులకు వివరించామన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు వడ్డే నరసింహ, జనార్దన్, కిరణ్ ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

నారాయణఖేడ్: సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరయిన చెక్కులను శనివారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఖేడ్‌లోని పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఖేడ్ మండలం పోతన్‌పల్లి (ఎం) గ్రామానికి చెందిన అంజమ్మకు రూ.18 వేలు మంజూరయ్యాయి. మనూరు మండలం మాయికోడ్ తాజా మాజీ సర్పంచ్ సుధాకర్‌కు రూ.49, 500, తొర్నల్ గ్రామానికి చెందిన కొఠారి లాలప్పకు రూ. 15,500 చెక్కులను అందజేశారు. కంగ్టి మండలం దెగుల్‌వాడికి చెందిన జ్ఞానొరెడ్డికి సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరయిన చెక్కును డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అందజేశారు.


నారాయణఖేడ్: చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని హద్నూర్‌లో శనివారం బీఆర్ఎస్ నాయకులు లబ్ధిదారునికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు. గ్రామానికి చెందిన పల్లే అశోక్ కుమారుడు రంజిత్ రోడ్డు ప్రమాదంతో గాయాలపాలై ఆస్పత్రి చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.13.500 మంజూరయింది. చెక్కును లబ్ధిదారునికి అందించాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు నాయకులకు సూచించారు.

పార్క్ పురోగతి పూర్

- వీరన్నగూడెంలో రూ.3.50 కోట్లతో ఏర్పాటు
- 90% పనులు పూర్తి
- ఎదురుచూపుల్లో ప్రజలు


ప్రారంభానికి నోచుకోని బొంతపల్లి అర్బన్ పార్క్

జిన్నారం(పటాన్‌చెరు): స్వయంగా కలెక్టర్ ఆదేశించినా గుమ్మడిదల మున్సిపాలిటీ వీరన్నగూడెం పరిధిలో అర్బన్ పార్క్ పనులు ముందుకు సాగడం లేదు. నిధుల విడుదలలో జాప్యం, హెచ్‌ఎండీఏ, అటవీ అధికారుల మధ్య సమన్వయం కొరవడటంతో ఈ పార్క్ పనులు ఎప్పటికి పూర్తవుతాయో చెప్పలేని పరిస్థితుల్లో సంబంధిత అధికారులున్నారు. నగరవాసులు వారాంతాల్లో సేద తీరేందుకు గత ప్రభుత్వం అర్బన్ పార్కుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా అటవీ శాఖకు చెందిన 730 హెక్టార్ల స్థలాన్ని హెచ్‌ఎండీకు అప్పగించింది. హెచ్‌ఎండీఏ రూ.3.50 కోట్ల నిధులతో పార్క్ చుట్టూ ప్రహరీ, రోడ్లు, వ్యూపాయింట్ వంటి సదుపాయాలు కల్పించింది. పార్క్‌కు సంబంధించి 90శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి.

పర్యవేక్షణేది?

హెచ్‌ఎండీఏ అధికారులు పార్క్ పనుల పర్యవేక్షణపై తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారు. దీనిపై ‘సాక్షి’ హెచ్‌ఎండీఏ, అటవీ శాఖ అధికారులను వివరణ కోరగా.. మొక్కలు నాటే పనులు పూర్తయ్యాయని, ఇంజనీరింగ్ శాఖ టాయిలెట్స్, టికెట్ కౌంటర్ ఏర్పాటు చేసి ఫారెస్ట్ శాఖకు అప్పగించినట్లు చెబుతున్నారే తప్పా పార్కు పనులు ఎప్పటికీ పూర్తవుతాయనేదానిపై మాత్రం స్పష్టతనివ్వలేదు. ఇప్పటికైనా పనులు పూర్తి చేసి పార్క్‌ను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

త్వరలోనే పూర్తి చేస్తాం



అర్బన్ పార్కు పనులు త్వరలో పూర్తి చేస్తాం. పనులు పూర్తిగా కావలసిన నిధుల అంచనాను హెచ్‌ఎండీఏ అధికారులకు పంపించాం. నిధుల విడుదల కాగానే కలెక్టర్ గారి ఆదేశాలతో పనులు మొదలుపెడతాం.

– శ్రీధర్‌రావు, అటవీశాఖ అధికారి, సంగారెడ్డి